క్లుప్తంగా

పొయ్యిల పంపిణీ



ఆధార్, రేషన్‌కార్డు వివరాలను నమోదు చేయించుకుంటున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి: మండలంలో పెదవలస పంచాయతీ డోకులూరు గ్రామంలో గ్రీన్‌జోన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గిరిజనులకు పొగరాని పొయ్యిలను గురువారం పంపిణీ చేశారు. గ్రామ వలంటీర్ గబులంగి వరలక్ష్మి, గ్రామ పెద్ద కృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఆధార్, రేషన్‌కార్డులున్న గిరిజనులకు ఉచితంగా పొగరాని పొయ్యిలను అందజేస్తున్నట్టు గ్రీన్‌జోన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చెప్పారు.

రైతు సంక్షేమానికి కృషి



కిసాన్ సమృద్ధి యోజన కేంద్రాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు

ఎటపాక: తోటపల్లిలోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి యోజన కేంద్ర బృందం గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ఎం.పెరమయ్య మాట్లాడుతూ దేశంలో రైతుల సంక్షేమానికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులకు తక్కువ ధరకే ఎరువులు అందజేస్తోందని, కిసాన్ క్రెడిట్ కార్డు రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. నాయకులు రామకృష్ణ, ప్రసాద్, విద్యా సాగర్, దుర్గారావు, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం



గ్రామస్తులతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వ్యాధుల ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలోని గురువారం ఉదయం స్థానికులతో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్, సర్పంచ్ వెంకటరావు, ఉప సర్పంచ్ జగ్గునాయుడు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గోతులు



తైడ సమీపంలోని కూలేందుకు సిద్ధం ఉన్న రక్షణగోడ

అనంతగిరి:మండలంలోని అనంతగిరి ఘాట్ రోడ్డు వర్షాలకు అస్తవ్యస్తంగా మారింది. ఇటీవల ఓహెచ్‌సీ కేబులు వేసేందుకు రక్షణ గోడలను ఆనుకుని గోతులను తీశారు. అయితే వర్షాలు కారణంగా గోతులు నుంచి వర్షపు నీరు భారీగా ప్రహించడంతో రక్షణగోడలు పడిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. డముకు నుంచి తైడ గ్రామ సమీపం వరకు ఘాట్‌రోడ్డులోని రక్షణగోడలు పరిస్థితి ప్రమాదభరితంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వెనువెంటనే గోతులను పూడ్చి, రక్షణ చర్యలను చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మోతుగూడెం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త విద్యుత్ ఉద్యోగుల ఆందోళనలో భాగంగా గురువారం లోయర్ సీలేరు, మోతుగూడెం, డొంకరాయి విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక సీఈ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వచ్చేనెల పదోవ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అనంతరం నిరవధిక సమ్మె చేపడతామని జేఏసీ చైర్మన్ వి.కిరణ్ చెప్పారు.

చెంతకే పౌర సేవలు

- జగనన్న సురక్షతో త్వరితగతిన ధ్రువపత్రాల మంజూరు
- ఆనందంలో లబ్ధిదారులు



మాదలలో ధ్రువపత్రం అందజేస్తున్న తహసీల్దార్ వేణుగోపాలరావు తదితరులు



యండపల్లివలసలో లబ్ధిదారులకు ధ్రువపత్రం అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయటౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైంది. దీని ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకే చేరదీసింది. ఈ కార్యక్రమాన్ని సేవా యజ్ఞంగా ఈనెల 1వ తేదీ నుంచి ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చూడడంతో పాటు జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు రేషన్ కార్డు వంటి 11 సేవలను అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. అధికారులు గ్రామాలకు వెళ్లి అవసరమైన ధ్రువపత్రాలను లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తున్నారు. ఇటువంటి కార్యక్రమాలు గతంలో ఎప్పుడూ చూడలేదంటూ లబ్ధిదారులు ప్రభుత్వానికి ధన్యవాదములు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గిరిజనులకు అవసరమైన వివిధ సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో కొన్నిచోట్ల ఈ కార్యక్రమం పూర్తి కాగా, మరిన్ని చోట్ల కొనసాగుతోంది.

అందుతున్న సేవలు

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఆదాయం, ఇంటిగ్రేటెడ్, ఓబీసీ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్, కౌలు రైతు కార్డులు, రేషన్‌కార్డులో అదనపు సభ్యుల చేర్పు, కొత్త రేషన్‌కార్డులు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్, అడంగల్ సర్టిఫికేట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆరోగ్యశ్రీ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులో అప్‌డేట్ వంటి సేవలు అందిస్తున్నారు. ఎలాంటి సర్వీస్ చార్జీలు ఉచితంగా పత్రాలను అందజేస్తోంది. గ్రామాల్లో క్యాంపులు నిర్వహించే రోజున లబ్ధిదారుల ఫోన్లకు ముందుగా మెసేజ్ పంపించడమే కాకుండా, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ , వలంటీర్ల ద్వారా ముందుగా తెలియజేస్తున్నారు.జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో ఇప్పటి వరకు అరకులోయలో- 6,041మందికి, డుంబ్రిగుడలో- 11,886మందికి, అనంతగిరిలో- 12,700 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు.

తక్షణమే ధ్రువపత్రాల అందజేత



తహసీల్దార్, ఎంపీడీఓలు రెండు టీంలుగా ఏర్పడి ప్రతీ రోజు రెండు సచివాలయాలకు వెళ్లి ప్రజలు దరఖాస్తు చేసుకున్న ధ్రువపత్రాలను అందజేస్తున్నాం. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నాం. వీఆర్‌ఓ, వలంటీర్ల ద్వారా గిరిజనులకు ఏ సర్టిఫికెట్లు అవసరమో తెలుసుకొని వెంటనే ధ్రువపత్రాలను అందజేస్తున్నాం.

– వేణుగోపాలరావు, తహసీల్దార్, అరకులోయ.

పైసా ఖర్చు లేకుండా



యండపల్లివలస గ్రామం, కుల ధ్రువీకరణ పత్రం కోసం జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకున్నాను. పైసా ఖర్చు లేకుండా ఒక్క రోజులోనే పత్రం అందజేశారు. గతంలో నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం జగనన్న పాలనలో పైసా ఖర్చు లేకుండా గంటల వ్యవధిలో ధ్రువపత్రాలు పొందడం సంతోషంగా ఉంది.

– కె.రాజులు, యండపల్లివలస గ్రామం, అరకులోయ మండలం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఎగువశోభలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, అధికారులు



డొంకరాయిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



కార్యక్రమానికి తరలివచ్చిన వివిధ గ్రామాల ప్రజలు

అనంతగిరి: మండలంలోని ఎగువశోభ పంచాయతీ కేంద్రంలో ఎంపీడీవో కుమార్ ఆధ్వర్యంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి లబ్ధిదారులకు మంజూరైన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు.జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, సర్పంచ్ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని నెల్లిపాక, లక్ష్మీపురం గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 449 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీటీసీలు అంజలి, కమల, ఆర్ఐ బాపిరాజు, సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సర్పంచ్‌లు భద్రమ్మ, సరోజని, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండంలోని బొడ్డగండి పంచాయతీ డొంకరాయి గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 450 మందికి మంజూరైన వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ జోగిరెడ్డి తదితరులు అందజేశారు. వారు మాట్లాడుతూ జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు.ఎంపీటీసీ సభ్యులు సుబ్బలక్ష్మి, ప్రసాదరెడ్డి, సర్పంచ్ సంధ్యారాణి, కో–ఆప్షన్ సభ్యుడు రమణ, ఎంపీడీవో బి.శ్రీనివాసులు, డీటీ కె.సుధాకర్, ఈవోపీఆర్డీ మధుసూదనరాజు తదితరులు పాల్గొన్నారు.



నెల్లిపాకలో సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు



భీరం గ్రామంలోని పొలంలో వీడర్‌తో కలుపును తొలగిస్తున్న గిరిజన రైతు



పంపిణీ చేసిన విత్తనాలతో రైతులు, కేవీకే సిబ్బంది

గంగవరం: లక్కొండ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ వెంకటేష్ ఆధ్వర్యంలో మీనామృతం, దశపర్ణి కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆయన చెప్పారు. వెంకటేష్, దుర్గాదేవి, ప్రసాద్, వీరలక్ష్మి పాల్గొన్నారు.

రంపచోడవరం: పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో సిబ్బందికి పీఈఈ శ్రీనివాసరావు ప్రకృతి సాగుపై శిక్షణ ఇచ్చారు. రాగుల విత్తనాలను పంపిణీ చేశారు. కేవికే డైరెక్టర్ లలితా కామేశ్వరి, ఏవో లక్ష్మణ్, పలువురు సైంటిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: భీరం పంచాయతీ కేంద్రంలో గల వరి పొలాల్లో వీడర్ యంత్రం వినియోగంపై రైతులకు ప్రకృతి వ్యవసాయ విభాగ రైతుసాధికార సంస్థ ఎం నిట్టాపుట్టు, భీరం యూనిట్ ఇన్‌చార్జి ఎం.ప్రసాద్, రామలింగం అవగాహన కల్పించారు. జీవామృతంతో పంట దిగుబడి పెరుగుతుందన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం విద్యార్థులు 200 మొక్కలను నాటారు.ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వైస్ ప్రిన్సిపల్ రసూల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు రమేష్‌కుమార్, గౌరిశంకరరావు, అధ్యాపకులు కోటేశ్వరరావు, ధర్మారావు, అచ్యుత్, విజయలక్ష్మి, వరిజ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రూప్‌చంద్, కార్యదర్శి గౌసియా తదితరులు

అనంతగిరి: మండలంలోని డ్రైనేజీ మూసివేయడంతో వివాదం నెలకొంది. దీనిపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పినకోట వైద్యాధికారి రూప్‌చంద్, పంచాయతీ కార్యదర్శి గౌసియాతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. అనంతరం గౌషియా మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ మూసివేయడంతో మురుగునీరు నిలిచిపోతుందన్నారు. డ్రైనేజీ వ్యవస్థ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సబ్ యూనిట్ అధికారి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగాకరకు గిరాకీ



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆగాకర కాయలు

రాజవొమ్మంగి: మండలంలోని కిమ్మిలిగెడ్డ సమీప పొలాల్లో 5 ఎకరాల్లో వేసిన ఆగాకర తోట విరగ్గాసింది. పాదుల ద్వారా రోజుకు 200 కిలోలకు పైగా ఆగాకర కాయాల కోతకు వస్తుండడంతో రైతుల పంట పండిందని స్థానికులు చెబుతున్నారు. వీటిని నర్సీపట్నం, విశాఖపట్నం కూరగాయాల మార్కెట్‌కు తరలిస్తున్నారు. మార్కెట్లులో ప్రస్తుతం వీటి ధర కిలో రూ. 150 పలుకుతుండటంతో కష్టం ఫలించిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆగాకర కాయలు స్థానికంగా అడవుల్లో సహజసిద్ధంగా లభించేవి. ప్రస్తుతం కూరగాయాలకు డిమాండ్ పెరగడంతో ఆగాకర, కాకర, టమాటా, దొండ, మిర్చి వంటి పంటల సాగుపై రైతులు మొగ్గ చూపుతున్నారు.

విద్యార్థులకు తప్పని ఇక్కట్లు



రైస్ మిల్లులో కొనసాగుతున్న తరగతులు

జి.మాడుగుల: గెమ్మెలి పంచాయతీ ఊడపాలెంలోని ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. వర్షానికి పైకప్పు కారిపోతుందని, కిటికీలు, తలుపులు పాడయ్యాయని, గదుల్లో వర్షపు నీరు చేరుతోందని ఏ క్షణాన భవనం కూలిపోతోందనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక పాఠశాల పక్కనే ఉన్న రైస్‌మిల్లు భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊడపాలెంలో రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా సమస్యలు వారు కోరుతున్నారు.

వాహన తనిఖీలు

హుకుంపేట: మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో గురువారం హుకుంపేట మండల కేంద్రంలో ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. అనుమానస్పద వ్యక్తుల నుంచి వివరాలు సేకరించారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం



గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

పాడేరు రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని, అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు అన్నారు. మండలంలోని మారుమూల దేవాపురం గ్రామ సచివాలయం పరిధి పులుసుమామిడి, కందుపాలెం గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో 220 గడపలను సందర్శించారు. ప్రతి గడపకు వెళ్లి గిరిజనుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వారికి లబ్ధిదారులు వివరించి సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను నెలకొల్పి మహాత్మా గాంధీ కలలు కన్న నిజమైన గ్రామ స్వరాజ్యం స్థాపించారన్నారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న దేవాపురం రోడ్డు సమస్యను తాము అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలకే పరిష్కారించన్నారు. గ్రామాల్లో సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ నెలకొల్పి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే పథకాలను అందిస్తున్నారని చెప్పారు. సర్పంచ్ కిల్లు పరమేశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలకు చెక్



అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్

చింతపల్లిరూరల్:మావోయిస్టుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలకు చెక్ పెట్టే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ అన్నారు.ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మావోయిస్టు బలగాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. శనివారం నుంచి సీపీఐ మావోయిస్టుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు జరుపుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆధ్వర్యంలో ప్రత్యేక భద్రత కోసం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు. ఎక్కడ హింసాత్మక చర్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.బాంబ్ స్క్వాడ్‌లతో ప్రధాన కేంద్రాలు, రహదారుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నమన్నారు. మావోయిస్టుల కదలికలు కట్టడి చేసేందుకు డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. వారోత్సవాల నేపథ్యంలో ప్రజలు అధైర్యపడాల్సిన పనిలేదన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు ఆదేశించారు.మండలంలోని రింతాడ-1,2 సచివాలయాలను ఆయన గురువారం సందర్శించారు. రింతాడ-1లో ఉదయం 10.30గంటలైనా సిబ్బంది విధులకు హాజరుకాకపోవడం, కార్యాలయానికి తాళం వేసి ఉండడాన్ని గమనించారు. డీడీవోగా పనిచేస్తున్న వై.ఎ.రెడ్డి గత వారం రోజులుగా హాజరుకాకపోవడం, ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలులో నిర్లక్ష్యం వహించడంతో డీడీవోతో పాటు సిబ్బందికి మెమోలు జారీ చేశామన్నారు. అనంతరం రింతాడ-2 సచివాలయం సందర్శించగా వెల్ఫేర్ అసిస్టెంట్, డీఏ లు మాత్రమే అందుబాటులో ఉన్నారని, మిగిలిన సిబ్బంది హాజరు కాలేదని, సచివాలయ సిబ్బందికి డీడీఓ సహకరించడం లేదని తెలుసుకొని, అతనిపై చర్యలు తీసుకోంటామని ఎంపీడీవో తెలిపారు.

కూలిన అక్విడెక్ట్: వృథాగా సాగునీరు



వృథాగా పోతున్న నీరు

కొయ్యూరు: సుమారు వంద ఎకరాలకు సాగునీరు అందించే గుడ్లపల్లి ప్రాజెక్టు ఆయకట్టు (అక్విడెక్ట్) కూలిపోయింది.గడచిన 30 సంవత్సరాల కిందట దీన్ని నిర్మించారు.శిథిలావస్థకు చేరిన అక్విడెట్ ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కూలిపోయింది. ఈ కారణంగా తాల్లపాలెం, దొడ్డవరం, చీడిపాలెం గ్రామాల పరిధిలోని సుమారు 100 ఎకరాలకు పైగా భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంత రైతులు సూరిబాబు, సత్తిబాబు, రాజుబాబు, శ్రీనివాస్ తదితరులు కోరుతున్నారు. ఈ విషయంపై నీటిపారుదల శాఖ జేఈ రామకృష్ణ మాట్లాడుతూ కొత్త అక్విడెట్ నిర్మాణం కోసం ప్రతిపాదించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం వర్షాలు తగ్గిన తరువాత పనులు చేపడతామన్నారు.

కళాశాలలో స్వచ్ఛభారత్



డిగ్రీ కళాశాల ఆవరణలో తుప్పలు తొలగిస్తున్న విద్యార్థులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కళాశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ పరిసరాల పరిరక్షణ మన అందరి బాధ్యత అన్నారు. ఎన్ఎస్ఎస్ పీవోలు పి.నాగబాబు, వై. విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో తుప్పలు పెరిగి, దోమలు విజృంభిస్తున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకొని జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విద్యార్థుల చేత కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె. పద్మలత, కో–ఆర్డినేటర్ పి. కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



గంగవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నేతలు

రంపచోడవరం: మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన సంఘటనను ఖండిస్తూ ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.అనసూయ మాట్లాడుతూ మణిపూర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఆదిలక్ష్మి, బాపనమ్మ, జోగమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మణిపూర్ సంఘటనను వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. నేతలు రఘుబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.